సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎన్‌ఏడీలో ట్రాఫిక్‌పై అవగాహన



ఎన్‌ఏడీలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల కలిగే అనర్థాలు, అతి వేగం వల్ల జరిగే ప్రమాదాలపై సుప్రా వాహనం ద్వారా ఆయన పాదచారులు, వాహన చోదకులకు వివరించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల ప్రమాదాల్ని నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వాసుదేవ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



కంచరపాలెం రైతుబజారు ప్రాంతంలో దుకాణాలను తరలిస్తున్న సీఐ అప్పారావు

కంచరపాలెం: రహదారులు ఆక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి, కంచరపాలెం రైతుబజారు, ఊర్వశికూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా ప్రాంతాల్లో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు, జోన్-5 టౌన్‌ప్లానింగ్ నేతృత్వంలో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఐటీఐ కూడలిలో ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించారు. రైతుబజార్ ప్రాంతంలో తోపుడుబళ్ల తో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతుందని సీఐ మళ్ల అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఐఎస్‌ఎంసీ సభ్యుడిగా హనుమంతు పురుషోత్తం



ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఇంక్యుబేటర్ సీడ్ ఫండ్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఐఎస్‌ఎంసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మరట్వాడా యూనివర్సిటీలో(బీఏఎంయూ)ని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఐఎస్‌ఎంసీ ఏర్పాటైంది. దీనిలోని 11 మంది సభ్యుల్లో ఒకరిగా డాక్టర్ పురుషోత్తం నియమితులయ్యారు. నీతి అయోగ్, మహారాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ సంయుక్తంగా ఏఐసీ-బీఏఎంయూని ఏర్పాటు చేశాయి.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

సీతమ్మధార: ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ విద్యార్థి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..గ్రీన్‌పార్కు కాలనీలో పి.హేమేశ్వరరావు, భార్య, కుమారుడు నివాసం ఉంటున్నారు. సీతమ్మధారలోని బాలయ్య శాస్త్రిలేఅవుట్ ఓ స్కూల్‌లో టీఎస్‌వీపీ నాథల్ 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు స్కూల్ నుంచి నడుచుకుంటూ పెట్రోల్ బంక్ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో గాయపడిన నాథల్‌ను సమీపంలోని ఓ ఆస్పత్రికి స్థానికులు తీసుకువెళ్లారు. తలకు తీవ్ర గాయమవడంతో వైద్యులు చికిత్స చేస్తున్నారు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ వి.శ్రీనివాసరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా ఢీకొట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

వైజాగ్ వెస్ట్

9398184202, 9912440606

సాక్షి

విద్యార్థుల భవిష్యత్తుకు జగనన్న భరోసా



విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ సుధ



62వ వార్డులో జేవీకే కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

- సకల సదుపాయాలు కల్పిస్తున్న సీఎం
- బాగా చదివి ఆయన ఆకాంక్ష నెరవేర్చాలి

మల్కాపురం : పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని రాణించాలన్న ధ్యేయంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సకల సదుపాయాలు కల్పిస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తుకు జగనన్న భరోసా కల్పిస్తున్నారని కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఆమె సుమారు 150 మంది విద్యార్థులకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇంత మంచి కార్యక్రమం ద్వారా పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, సాక్సులు, యూనిఫామ్‌తో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, చిక్కీలు, రాగి జావ వంటి పౌష్టికాహారం అందిస్తున్నారని వివరించారు. మీ కోసం ఇంత చేస్తున్న ఆయన మీ నుండి ఏమీ ఆశించలేదని, కేవలం మీరు ఉన్నత విద్యావంతులైతే చాలని ఆయన కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, నాయకులు దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యాకానుక కిట్ల పంపిణీ జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమణికుమారి ఆధ్వర్యంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు చేతుల మీదుగా విద్యార్థులకు ఈ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, షూ తదితర సామగ్రినంతటినీ అందిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు వంటి పథకాలతో విద్యారంగంలో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకుని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో 'నారాయణ అండ్ కో' సందడి



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు చిన్న పాపిశెట్టి

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నారాయణ అండ్ కో చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కళాశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. చిత్ర కథానాయకుడు సుధాకర్ కాముకల, కథానాయిక ఆర్తి, దర్శకుడు చిన్న పాపిశెట్టి, నటి ఆమని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించామన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

రైతు బజార్ వద్ద ఆక్రమణల తొలగింపు

మర్రిపాలెం : నిత్యం ట్రాఫిక్‌జామ్‌కు కారణమవుతున్న రైతుబజార్ వద్ద ఆక్రమణలను తొలగించారు. ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్‌ఐ పాపారావు సమక్షంలో కానిస్టేబుళ్లు మంగళవారం ఆక్రమణలు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న తోపుడుబండ్లు, హాకర్లను తొలగించారు. వారు మాట్లాడుతూ, తోపుడు బండ్లు హాకర్‌జోన్లలో ఉంచి వ్యాపారాలు సాగించాలని కోరారు.

అత్యవసర వేళ సంజీవనిలా.



సెబ్డా ఆవిర్భావంలో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు

- వేలమందిని ఆదుకుంటున్న 'సెబ్డా'
- రోగులకు నేరుగా రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

అత్యవసర వేళ అందించే రక్తం సంజీవని వంటిదే. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్స సమయాల్లో రక్తం అత్యావశ్యకం. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదు అనే సత్సంకల్పంతో స్టీల్‌ప్లాంట్ యువకార్మికుల చొరవతో ఆవిర్భవించిందే..ఉక్కు రక్తదాతల సంఘం (స్టీల్ ఎంప్లాయిస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్- సెబ్డా). వీరు అందిస్తున్న రక్తం వేలాది మంది ప్రాణాలను నిలుపుతోంది.



రక్తదానం చేస్తున్న ఉక్కు ఉద్యోగి పోలీసు నాయుడు (ఫైల్ ఫొటో)

ఉక్కునగరం: సాటివారికి సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. మనం ఇచ్చే రక్తం ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుంది అంటే అది అన్నింటినీ మించిన సాయమే అవుతుంది. అయితే, బ్లడ్‌బ్యాంకులు నిర్వహించడం, రక్తం నిల్వ ఉంచడం, అవసరమైన గ్రూప్ లేకపోతే రక్తదాతలను అన్వేషించడం కంటే కొంతమంది రక్తదాతలను ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చేసి నేరుగా రక్తాన్ని దానం చేసేలా ప్రోత్సహిస్తే నగరానికి దూరంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ వంటి ప్రాంతాల వారికి అనువుగా ఉంటుందని భావించారు కొంతమంది యువ కార్మికులు. వారి కృషి ఫలితంగా ఏర్పడింది ఉక్కు రక్తదాతల సంఘం. కొమ్మోజు ఉమామహేశ్వరరావు (టీపీపీ), ఎం. సందీప్ (సీఈడీ), వై.అప్పారావు (డబ్ల్యూఎండీ), కె.వి. అప్పారావు (డబ్ల్యూఎండీ), డి. బాబూరావు (సీఈడీ), పోలీసు నాయుడు (బీఎఫ్), ఎం. గణేష్‌కుమార్ (వైర్ రాడ్ మిల్), వైకుంఠరావు (ఈఆర్‌ఎస్), రాజశేఖర్ (డబ్ల్యూఎండీ) 2012లో స్టీల్ ఎంప్లాయిస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ (సెబ్డా)ను రిజిస్టర్ చేశారు.

వాట్సాప్.. ఫోన్ ద్వారానే...

సుమారు వెయ్యి మంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులతో వివిధ రక్త గ్రూపులతో కూడిన రక్త దాతలను సిద్ధం చేశారు. ఎటువంటి కార్యాలయం లేకుండానే కేవలం వాట్సాప్, మొబైల్ ఫోన్ల ద్వారానే అత్యవసర రోగుల పరిస్థితులకు అనుగుణంగా రక్తదాతలను పంపడం సెబ్డా ప్రత్యేకత.

ఉక్కు జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో పాటు బయట బ్లడ్ బ్యాంక్‌ల నుంచి రక్తాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రి యాజమాన్యం అంగీకరించని పరిస్థితులను చూసిన సంఘం ప్రతినిధులు ఉక్కు జనరల్ ఆస్పత్రి రోగులకు మొదటి ప్రాధాన్యతగా రక్తదాతలను పంపడం ప్రారంభించారు. ఈ విధంగా ఇప్పటి వరకు సుమారు 3 వేల మంది రోగులకు అవసరమైన దాతలను పంపి రక్తం అందజేశారు. కరోనా సమయంలో ప్లాస్మా కొరత ఉన్న రోగులకు ప్లాస్మా అందించి తమ వంతు సాయం అందించారు. ఇందుకోసం రోగుల నుంచి ఎటువంటి రుసుం వసూలు చేయటం లేదు.

బ్లడ్ బ్యాంకులతో అవగాహన

నగరంలోని పలు బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు తగ్గినప్పుడు వారికి అవసరమైన గ్రూప్ రక్తానికి సంబంధించిన దాతలను పంపిస్తుంటారు. అదే విధంగా అత్యవసర పరిస్థితుల్లో సెబ్డా వద్ద అవసరమైన రక్తం లేనప్పుడు ఆయా బ్లడ్ బ్యాంక్‌ల నుంచి తీసుకునేలా అవగాహన కుదుర్చుకున్నారు. నగరంలోని యువతతో ఏర్పడిన 'జనరేషన్ యువ' తో ఉన్న అవగాహన మేరకు అవసరమైనప్పుడు రక్తదాతలను పంపుతుంటారు.

రక్తం అవసరమైన వారు రక్తదాతల కోసం సెబ్డా ప్రతినిధులు ఎం.సందీప్ (90322 11188), కె. ఉమామహేశ్వరరావు (98855 61161)లను సంప్రదించవచ్చు.

ఆపదలో ఉన్నవారికి రక్తం అందిస్తున్నాం



ఆపదలో ఉన్నవారికి రక్తం అందుబాటులో ఉంచాలనేదే సెబ్డా ధ్యేయం. రక్తం లేకపోవడం వల్ల వ్యక్తి ప్రాణాలకే ముప్పు వచ్చిందనే పరిస్థితి రాకుండా చూడటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా రక్తదాతల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం.

– ఎం. సందీప్, సెబ్డా కన్వీనర్

21 సార్లు రక్తదానం



బ్లడ్ క్యాంప్‌లను నిర్వహించడం ద్వారా బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉంచడం కాకుండా అవసరమైనప్పుడు రక్తదాతలను ఏర్పాటు చేస్తున్నాం. నేను 2015 నుంచి ఇప్పటికి 21 సార్లు రక్తదానం చేశాను. మూడు సార్లు ప్లాస్మా దానం చేశాను. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదాతలు మరింత మంది ముందుకు రావాలి.

– బి. వైకుంఠరావు, సెబ్డా వర్కింగ్ ప్రెసిడెంట్

వైభవంగా కనకమాంబ పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్



ఆకట్టుకున్న కాంతారా డ్యాన్స్ ట్రూప్

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ప్రధాన పండుగ కన్నుల పండువగా జరిగింది. మంగళవారం తెల్లవారు జామునుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతంపేట, గొల్లవీధి, నాయుడువీధి, కనకమ్మవీధి, శ్రీనివాసవీధి, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులతో మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం నాయుడు వీధిలోని పుట్టబంగారం ఘటాలతో అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి హారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోయ డ్యాన్సులు, నేల డ్యాన్సులు, తప్పెట గుళ్లు, కోలాటం, పులివేషాలు, పగటి వేషాలు, సేవ గరిడీలు, కర్రసాము, చెక్కభజన వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కాంతారా డ్యాన్స్ ట్రూప్ విశేషంగా ఆకట్టుకుంది. బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీతంపేట కూడలిలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రెల్లివీధి రోడ్‌లో ఏర్పాటు చేసిన భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్,ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్,మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, ఆడిటర్ జీవీ, గొలగాని శ్రీనివాస్, చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, కోశాధికారి బోర వెంకటరమణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలను సత్వరం పరిష్కరిస్తాం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



74వ వార్డు దయాల్‌నగర్‌లో ఛిద్రమైన రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

పెదగంట్యాడ: గ్రేటర్ విశాఖ పరిధిలోని సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ 6వ జోన్ పరిధిలోని 65, 74 వార్డుల్లో ఆయా వార్డు కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డితో కలసి ఆయన మంగళవారం పర్యటించారు. 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్ రాజీవ్ స్టేడియంతో పాటు రాజరాజేశ్వరి ఓపెన్ ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. వికాస్‌నగర్‌లోని పార్కుతో పాటు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. వాంబే కాలనీలో కాల్వల మరమ్మతులు చేపడతామని చెప్పారు. వికాస్‌నగర్ గెడ్డ సమస్యను కార్పొరేటర్ వివరించగా టెండర్లు పిలిచామని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. వార్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి : 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సచివాలయ శానిటరీ కార్యదర్శులు వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. దయాల్‌నగర్‌లోని పైపులైన్లు నిత్యం దెబ్బ తింటున్నాయని, యూజీడీ గోతులు పూడ్చాలని, వీధి దీపాలు వెలిగించాలని కార్పొరేటర్ వంశీరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీసీ రోడ్డు మార్జిన్‌లో అధికంగా భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయని, వాటిని తొలగించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌ను గెలిపించుకుందాం



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్‌లు, నాయకులు

మల్కాపురం : పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా, వచ్చే ఎన్నికల్లో ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకునేలా మనమంతా శ్రమించాలని 40,62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, 58,59,60,61వ వార్డుల పరిధి ముఖ్య నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, నరేష్, దాడి సత్యనారాయణ అన్నారు. వీరంతా 58వ వార్డు గుల్లలపాలెం వద్ద గల పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ పూర్తిస్థాయి మెజారిటీ సాధించాలంటే ప్రజలకు ప్రభుత్వం అందించిన పథకాలు, తద్వారా వారు పొందిన లబ్ధి, మరల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే మరిన్ని సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఆనంద్‌కుమార్ విజయానికి శక్తికి మించి శ్రమించాలన్నారు. గడప గడపకు మరలా వెళ్లి పార్టీ గెలుపునకు శ్రమిద్దాం అన్నారు.

మాతృ మరణాల నివారణ బాధ్యత వైద్యులదే



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లాలో మాతృ మరణాలు సంభవించరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాంత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కారాదన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మాతృ మరణాలు జరిగితే దానికి వైద్యులు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గర్భిణుల వివరాల నమోదు నాటి నుంచి ప్రసవించే వరకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ డి.వెంకటలక్ష్మి, వీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, గైనిక్ వైద్యులు డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా : త్రినాథపురం కొండదేవతమ్మ గుడి ఎదురుగా ఉన్న కరాటే కోచింగ్ క్లబ్‌లో శిక్షణ తీసుకుని ఇటీవల తిరువనంతపురంలో జరిగిన నేషనల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అభినందించారు. పోటీల్లో పాల్గొని 3 స్వర్ణ, 4 రజత, 3 కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు కోచ్‌లు పోలరాజు, సునీల్‌ను మంగళవారం పూలమాలలు, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నారని, క్రీడాకారులు కూడా కోచ్‌లు ఇస్తున్న శిక్షణను శ్రద్ధగా అనుసరించి తద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి తల్లిదండ్రులు, గురువులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు కుమార్తె

గోపాలపట్నం: పాత గోశాల వద్ద తల్లితో నివాసముంటున్న ఓ బాలిక సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు ఆమెను వెదికి పట్టుకుని, తల్లి చెంతకు చేర్చారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామలక్ష్మి ఓ ఆఫీస్‌లో అటెండర్‌గా పని చేస్తోంది. ఈ నెల 12న ఆమె విధులకు వెళ్లిన సమయంలో బాలిక బయటికి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లి రామలక్ష్మి గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఈదుల నరసింహారావు వెంటనే స్పందించి సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ద్వారా మాడుగులలో ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడి నుంచి సిబ్బందిని పంపి మంగళవారం తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

15న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 15న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు.

కుర్చీల వితరణ



గోపాలపట్నం బాలికల హైస్కూల్ హెచ్ఎంకు కుర్చీలు అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు 1990-91 పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా కుర్చీలు అందించారు. ఇటీవల వీరు ఇక్కడి పాఠశాలలో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అక్కడితో ఆగకుండా చదువుకున్న పాఠశాలకు చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకుని పాఠశాలకు అవసరమయ్యే కుర్చీలను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ హెప్సిబాకు వీటిని అందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సువ్వాడ మురళీకృష్ణ, సొప్ప సూర్యనారాయణ, రాజు, పైడిరాజు, ఆనంద్, శివ, శ్రీను, అప్పలరాజు, సుగుణ, నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

(భారత ప్రభుత్వ సంస్థ)
రెప్కో బ్యాంక్
అంతికగర్ బ్రాంచ్, డోర్ నెం.58-1-433/1/2/1, ఎన్.ఎ.డి. జంక్షన్ వద్ద, విశాఖపట్నం.
ఫోన్ నెం. 0891-2702641, 9490737965
ఫిక్స్‌డ్ డిపాజిట్లపై
సీనియర్ సిటిజన్‌లకు 8.05% p.a
ఇతరులకు 7.55% p.a
బంగారు ఆభరణముల పై ఋణములు
గ్రా॥ రూ. 4,550/-* వరకు
స్థిరాస్తి తనఖా పై ఋణ సదుపాయం
వడ్డీ 9.90%* p.a. నుండి ప్రారంభం

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com